శ్రీమాతా నిమిషాంబ దేవి ఆవిర్భావ దినోత్సవం



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబ దేవి అమ్మవారి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్ మాట్లాడుతూ అమ్మవారు బంగారం చీరెతో దేదీప్యమానంగా వెలుగు దివ్వల కాంతులతో దర్శనమిచ్చినట్లు తెలిపారు. రజిత కవచంపైన స్వర్ణం తాపడం చీరెతో అలంకరించినట్లు పేర్కొన్నారు. అలాగే మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన చండీ హోమంలో ఆలయ ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేశ్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు , మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్‌దే గెలుపు'



పట్నం సునీతామహేందర్‌రెడ్డితో నాచారం నాయకులు

మల్లాపూర్: మల్కాజ్‌గిరిలో మరోసారి కాంగ్రెస్‌దే విజయమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నాచారం డివిజన్‌కు చెందిన పలువురు నేతలు శనివారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె పార్లమెంట్ ఎన్నికల్లో ఎండ తీవ్రతను సైతం లెక్క చేయకుండా గెలుపే లక్ష్యంగా ప్రచారం చేసి, ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించి చైతన్యం చేసిన కార్యకర్తలు, నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కలిసిన వారిలో నాచారం మాజీ కౌన్సిలర్ తుంగ తిరుపతి, సీనియర్ నేత అనుముల అశ్వద్ధామారెడ్డి, భారత మ్మ, లీలావతి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన చంద్ర కళానిలయం నాట్య గురువు పేరిణి సంతోష్ పెరుమాండ్ల శిష్య బృందంచే పేరణి, ఆంధ్ర నాట్యం ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శివానీ, కృతి, శ్రద్ధ, రమ్య, ప్రగ్య, నిత్యశ్రీ, సహాస్ర, హరిణి, శ్రీవల్లి, జాన్సీ ప్రదర్శనలో పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో ఈటల పూజలు



పూజలు చేసిన ఈటల రాజేందర్

మల్కాజ్‌గిరి: బేడ బుడగ సంఘాల అసోసియేషన్ నిర్వహణలో ఉన్న ప్రశాంత్‌నగర్ లోని నల్లపోచమ్మ ఆలయంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికత ప్రధాన మార్గమని అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నానన్నారు. కార్యక్రమంలో ఈటల వికాస్, బాల చందర్‌గౌడ్, చంద్రశేఖర్, నూనె లక్ష్మణ్, రాములు పాల్గొన్నారు.

కుప్పలు.. తిప్పలు



ఎదులాబాద్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

- నత్తనడకన సాగుతున్న కొనుగోళ్లు
- కేంద్రాల్లోనే మూలుగుతున్న ధాన్యం
- 20 రోజులుగా రైతుల పడిగాపులు..
- వర్షానికి భయపడుతున్న అన్నదాతలు
- వెంటనే స్పందించాలంటూ వినతి

ఘట్‌కేసర్: 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది అన్నదాతల పరిస్థితి. ధాన్యం కొనుగోళ్ల తీరు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్లు సాగుతోంది. కేంద్రంలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు కూలీలు లేక ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం కూలీలు అందుబాటులో ఉన్నా బ్యాగుల కొరత, తూకం వేసేందుకు సరిపోయేన్ని తూకం మిషన్లు లేకపోవడంతో 20 రోజులుగా ధాన్యం కుప్పల్లోనే మూలుగుతోంది. రెండు మూడు రోజులుగా వర్షంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు వాతావరణం మారిపోయి.. వర్షం కురుస్తోందనని ఆందోళన చెందుతున్నారు. నెల రోజులుగా ఎన్నికల బిజీలో ఉన్న అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో ఆగమవుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో 5-6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని భావించినా ఇప్పటి వరకు కేవలం 1100 టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. మండలంలో మాదారం, ఎదులాబాద్, ప్రతాపసింగారం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుంది.

తూకం మిషన్లు తరచూ చెడిపోతున్నాయి

ఈ విషయమై డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ మేనేజర్ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా బ్యాగులు కావాలని పౌర సరఫరా శాఖ అధికారులను కోరాం. డిమాండ్ అధికంగా ఉండటంతో బ్యాగులు సరిపోవడం లేదు. మార్కెట్ కమిటీ వారు అందజేసిన తూకం మిషన్లు తరచూ చెడిపోతున్నాయి. మరమ్మతులు చేయించి కొనుగోళ్లు కొనసాగిస్తామన్నారు.

తప్పని ఎదురుచూపులు..

ధాన్యం కుప్పలు పోసి 20 రోజులైనా రైతులకు టోకన్లు జారీ చేయడం లేదని అంటున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పని చేయడానికి ఏటా బీహార్ నుంచి కూలీలు వస్తుంటారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో ఈసారి కూలీలు ఆలస్యంగా వచ్చినా కేంద్రాల్లో సరిపోనూ బ్యాగులు లభించడం లేదు. దీంతో పాటు 35 మంది కూలీలు అందుబాటులో ఉన్నా అదనంగా తూకం మిషన్ లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు సమయంలో ఎండబెట్టడం, కుప్పలు పోయడం, ప్లాస్టిక్ కవర్లకు అద్దె చెల్లించడం ఆర్థికంగా భారంగా మారుతోందని రైతులు అంటున్నారు. తూకం మిషన్ అందించే వ్యవసాయ మార్కెట్, టోకన్లు జారీ చేసే వ్యవసాయ అధికారులు, బ్యాగులు, లారీలు పంపించే పౌర సరఫరా శాఖ అధికారులు, ధాన్యం కొనుగోలు చేసే డీసీఎంఎస్ అధికారుల సమన్వయ లోపంతోనే కొనుగోళ్లు ముందుకు సాగడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాగులు అందజేయాలి



కేంద్రంలో బ్యాగుల కొరత వేధిస్తోంది. 20 రోజులుగా కేంద్రంలోనే ధాన్యం కుప్పలుగా మూలుగుతోంది. వర్షంలో తడిసిన ధాన్యం ఆరబెట్టడానికి ఇబ్బందిగా మారింది. రైతులను ఇబ్బందులు పెట్టకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి.

– రమేశ్, రైతు, ఎదులాబాద్

టోకన్ ఇవ్వడం లేదు



ధాన్యం ఎండబెట్టి 20 రోజులు అవుతోంది. టోకన్ ఇవ్వడం లేదు. ముందు టోకన్లు పొందిన రైతుల ధాన్యం కొనుగోలు అనంతరం కొనుగోలు చేస్తామంటున్నారు. వర్షంతో చేతికందక ముందే చెడిపోయే అవకాశముంది. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి.

– సత్యనారాయణ, రైతు ఎదులాబాద్

రైతులను మోసం చేస్తూ..



రైతులకు మెరుగైన సేవలందిస్తామన్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బ్యాగుల కొరత వేధిస్తోంది. రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

– బొక్క కష్టారెడ్డి, బొక్కనిగూడ

నేడు వేంకటేశ్వరస్వామికి చందనోత్సవం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంటేశ్వర దేవస్థానంలోని మూలవిరాట్‌కు వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఈ నెల 19న (నేడు) వార్షిక చందనోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు ముడుంబై వెంకటరమణాచార్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రభాత ఆరాధన, 7 గంటలకు విశ్వక్సేన ఆరాధన అనంతరం 108 కళాశాలతో పంచామృత అభిషేకం అనంతరం చందన సేవ జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

ఉచిత వైద్య శిబిరం ..

మల్కాజిగిరి: రెడ్‌క్రాస్ సొసైటీ మేడ్చల్ జిల్లా గణపతి మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న (నేడు) సీనియర్ సిటిజన్స్ కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు భారత్, మాధవరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గఆనంద్‌బాగ్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

కొనసాగుతున్న కల్యాణ మహోత్సవం



ఆలయంలో మైలలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఒగ్గు పూజారులు

మల్లాపూర్: బీరప్పస్వామి కామరాతి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం రెండోరోజు బీరప్ప స్వామి మైలలు తీసే కార్యక్రమాన్ని నిర్వహించారు. బీరప్ప స్వామి దేవస్థానం ప్రధాన కార్యదర్శి చౌదరి పల్లి పర్వతాలు కురుమ ఇంటి నుంచి ఒగ్గు కళాకారుల డప్పు చప్పుళ్ల మధ్య వచ్చి మైలలు తీశారు. అనంతరం లింగాలను గంగకు పంపించారు. బీరప్ప స్వామి దేవస్థాన కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



నియామక పత్రం అందజేస్తున్న హరిశంకర్ శుక్లా

మల్కాజిగిరి: ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రియతం శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆనంద్‌బాగ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు హరిశంకర్ శుక్లా ప్రియతం శ్రీనివాస్‌తో పాటు మహిళా విభాగం అధ్యక్షురాలు మేఘనా జైన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వినియోగదారులకు సేవలందిస్తున్నామని త్వరలో తెలంగాణలోనూ పూర్తి స్థాయిలో సేవలందిస్తామని తెలిపారు. అలాదే జిల్లాలు, మండలాల్లోనూ కమిటీలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికీ పలుచోట్ల వినియోగదారులు మోసానికి గురవుతున్నారని వారిని చైతన్యం చేసేందుకు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి బాబా సాహెబ్ పాండే, రాంబాబు, కిశోర్, రామకృష్ణ పాల్గొన్నారు.

కుషాయిగూడ డిపో ఆదాయం రూ. 31.51 లక్షలు



కాప్రా: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కుషాయిగూడ డిపోకు బారిగా ఆదాయం సమకూరిందని డీఎం చంద్రకాంత్ తెలిపారు. డిపో నుంచి తెలంగాణతో పాటు ఏపీకి సాధారణ బస్సుల కంటే రోజుకు 15 నుంచి 20 ప్రత్యేక బస్సులను ఈ నెల 11, 12, 13, 14 తేదీల్లో నడిపించారు. కుషాయిగూడ డిపో నుంచి తెలంగాణలోని హనుమకొండ, తొర్రూరుకు, ఏపీలోని విజయవాడ, ఫణిగిరి, కందుకూరుతో పాటు ఇతర ప్రాంతాలకు 35 నుంచి 40 బస్సులు నడపగా రూ. 31 లక్షల 51 వేల 738 ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ పేర్కొన్నారు. ఇందులో మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసినవారు దాదాపు 15 లక్షల నుంచి 18 లక్షల వరకు ఉంటారని ఈ మొత్తం కూడా ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి రావాల్సి ఉందని ఆయన తెలిపారు.

రోడ్డు పనులకు మోక్షం



రాఘవేంద్రనగర్‌లో వేస్తున్న సీసీ రోడ్డు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీ పోచమ్మ ఆలయం సమీపంలో రెండేళ్లుగా నిలిచిన రోడ్డు పనులకు మోక్షం లభించింది. శనివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. పోతగాని గోపాల్‌గౌడ్, దేవులపల్లి యాదగిరి, నారాయణరెడ్డి అధికారులు, కాంట్రాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వాము వారి మఠంలో శ్రీ జగద్గురు వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆరాధన మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఉదయం సుప్రభాత సేవ, మంగళాభిషేకం, వీరబ్రహ్మేంద్రస్వామి సహస్రనామార్చన, మహానైవేద్యం, అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రంగాచారి, అంజలి, వెంకటేశం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఉద్రిక్తత



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న అడ్రిన్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

కుషాయిగూడ: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మండలం, ఆదర్శనగర్ పరిధిలోని సర్వే నంబర్ 152లో శనివారం ఉద్రిక్తత నెలకొంది.అడ్రిన్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తమ స్థలమంటూ కంచె ఏర్పాటు చేస్తుండగా, కస్టోడియల్ భూములంటూ పోలీసులు అడ్డుకున్నారు. స్థల వివాదం కోర్టులో ఉండగా పనులు చేపట్టడం సరికాదని పోలీసులు అసోసియేషన్ ప్రతినిధులకు సూచించడంతో కంచె పనులు నిలిపేశారు. ఇదిలా ఉండగా సాయంత్రం కాప్రా రెవెన్యూ అధికారులు కంచెను పాక్షికంగా తొలగించారు.

తమకు న్యాయం చేయాలి: అసోసియేషన్ ప్రతినిధులు

సర్వే నంబర్ 152లోని 13.7 ఎకరాల స్థలంలో 1996లో ఆసనంద్, లక్ష్మీపతి ఏర్పాటు చేసిన హుడా లే అవుట్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులైన తాము సుమారు 150 ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని అడ్రిన్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రబాబు, ప్రతినిధులు అరుణ, కాంతిరెడ్డి, ప్రసాద్, సుబ్రమణ్యం తెలిపారు. ఇప్పటికే కొందరు ఇండ్ల నిర్మాణ అనుమతులు పొందారని, మరికొందరు బ్యాంకు రుణాలు కూడా తీసుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మండల కుటుంబ సభ్యులు ఈ స్థలం తమదంటూ కోర్టును ఆశ్రయించారన్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలను కోర్టుకు అందించగా హైకోర్టులో కేసు కొట్టివేశారని తెలిపారు. తిరిగి సుప్రీంకోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. దీంతో తమ ప్లాట్లలో నిర్మాణాలు చేపడితే సదరు మండల కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారన్నారు. దీనిపై న్యాయపరంగా పోరాడుతామని తెలిపారు.

కోర్టు ఆదేశాలతో వచ్చిన వారికి సహకరిస్తాం: మహేశ్, కుషాయిగూడ ఏసీపీ

సర్వే నంబర్ 152తో పాటుగా సమీపంలోని పలు సర్వే నంబర్లలోని భూములు రెవెన్యూ రికార్డుల్లో కస్టోడియల్ భూములుగా ఉన్నాయని కుషాయిగూడ ఏసీపీ మహేశ్ తెలిపారు. ఇప్పటికే ఈ భూములు తమవంటూ ఒకరు 90 ఎకరాలపై ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకోగా, 69 ఎకరాలు కస్టోడియల్ భూములున్నట్లు రెవెన్యూ అధికారులు రిపోర్టు ఇచ్చారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ఒకరిని చూసి మరొకరు పొజిషన్‌కు వస్తే శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉంటుందన్నారు. కోర్టు ఆదేశాలతో వచ్చిన వారికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

ఎగిరిపోయారు..

- అవిశ్వాసం పెట్టే యోచనలో చైర్మన్ వ్యతిరేక వర్గం
- బ్యాంకాక్ బాట పట్టిన మున్సిపల్ కౌన్సిలర్లు



బ్యాంకాక్ టూర్‌కు బయలుదేరి వెళ్తున్న చైర్మన్ భర్త, తన వర్గం కౌన్సిలర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు బ్యాంకాక్ బాట పట్టారు. మున్సిపల్ చైర్మన్ పదవికి అవిశ్వాస గండం మెండుగా మారడంతో సదరు మున్సిపల్ చైర్‌పర్సన్ తన వర్గం కౌన్సిలర్లను మరోమారు విదేశీ యాత్రకు తీసుకెళ్లి బుజ్జగించే ప్రయత్నాలు మొదలు పెట్టింది. దీంతో శుక్రవారం రాత్రి చైర్‌పర్సన్ భర్త మద్దుల శ్రీనివాస్‌రెడ్డి తమవర్గం కౌన్సిలర్లను బ్యాంకాక్ టూర్‌కు తీసుకెళ్లారు.

అవిశ్వాస గండం తప్పదా..?

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉండగా ఒకరు కాంగ్రెస్, ఇద్దరు బీజేపీ నుంచి గెలుపొందగా మిగిలిన 12 మంది బీఆర్‌ఎస్ వారే గెలుపొందారు. నాడు బీఆర్‌ఎస్ అధికారంలో ఉండడంతో పాటు ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మంత్రిగా కొనసాగడంతో తన బావ మరిది అయిన మద్దుల శ్రీనివాస్‌రెడ్డి భార్య మద్దుల లక్ష్మీకి చైర్మన్ పదవి కట్టబెట్టారు. దీంతో వారు ఆడిందే ఆట అన్నట్లు వ్యవహారం నడిచింది. కౌన్సిలర్లు అసమ్మతికి గురైన సమయంలో మల్లారెడ్డి బుజ్జగించడం, ఆయన సూచనలతో చైర్మన్ భర్త వారిని విదేశీ యాత్రకు తీసుకెళ్లి శాంతింపజేయడం జరిగింది. కానీ ప్రస్తుతం అందుకు భిన్నంగా మున్సిపల్ రాజకీయం నడుస్తోంది.

కాంగ్రెస్ గూటికి చేరి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. బీఆర్‌ఎస్‌కు చెందిన అసమ్మతి కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్, బీజేపీలో చేరడం, మున్సిపల్ వైస్ చైర్మన్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో అవిశ్వాస గండం తప్పదనే చర్చ కొనసాగుతోంది. దీనికి తోడు మేడ్చల్ మున్సిపాలిటీలో ఇటీవల బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరి చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడంతో ఇక తమ వంతే అన్నట్లు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో రాజకీయం జోరందుకుంది.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతో కాంగ్రెస్ వైస్ చైర్మన్..

అవిశ్వాసం నుంచి తప్పించుకునేందుకు తనవర్గం వారిని బ్యాంకాక్ టూర్‌కు తీసుకెళ్లే ప్లాన్ చేసి వారితో శుక్రవారం రాత్రి విమానం ఎక్కగా వారితో పాటు ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ ఉండటంతో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం టూర్ వెళ్లిన వారిలో ముగ్గురు కౌన్సిలర్లు, ఒకరు కో ఆప్షన్ సభ్యుడు, మరో కౌన్సిలర్, కో ఆప్షన్ భర్తతో పాటు చైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ వైస్ చైర్మన్ ప్రభాకర్ మొత్తం 8 మంది ఉన్నారు. మరో కౌన్సిలర్ చైర్మన్ వర్గంలోనే కొనసాగుతున్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన వైస్ చైర్మన్ ప్రభాకర్, చైర్మన్ వర్గంలో టూర్‌కు వెళ్లడం చర్చగా మారగా వారి ప్లాన్‌ను తెలుసుకునేందుకే వెళ్లాడా లేక పార్టీ మారినా చైర్మన్‌కే తమ మద్దతు పలికేందుకు వెళ్లాడా అనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఎమ్మెల్యే మల్లారెడ్డికి చుక్కలు చూపించాలనే..

ఇప్పటికే బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు బీజేపీలో చేరగా మరో ఇద్దరు కౌన్సిలర్లు, ఓ కో ఆప్షన్ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో 15 మంది కౌన్సిలర్లలో బీఆర్‌ఎస్‌లో 8 మంది కొనసాగుతుండగా, బీజేపీ, కాంగ్రెస్‌లో నలుగురు చొప్పున ఉన్నారు. కో ఆప్షన్లు నలుగురికి గాను బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో ఇద్దరిద్దరు ఉన్నారు. మరోవైపు ఎమ్మెల్యే మల్లారెడ్డికి చుక్కలు చూపించాలనే యోచనలో ఉన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పట్టుబట్టి కౌన్సిలర్లను తమ పార్టీలో చేర్చుకుంటూ అవిశ్వాస తీర్మానాలకు తెరలేపడంతో తమకు అవిశ్వాసం తప్పదని చైర్మన్ వర్గం యోచిస్తోంది.

కాంగ్రెస్, బీజేపీ ఏకమయ్యేనా..?

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పీఠం నుంచి బీఆర్‌ఎస్ చైర్మన్‌ను దించేందుకు కాంగ్రెస్, బీజేపీ ఒక్కటవుతాయా అనే సంకేతాలు కనబడుతున్నాయి. ఎమ్మెల్యే మల్లారెడ్డికి రాజకీయంగా చుక్కలు చూపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ముఖ్య నేతలు యోచిస్తుండగా, బీజేపీ మున్సిపల్‌లో తమ బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం రెండు పార్టీలు ఏకమై బీఆర్‌ఎస్ చైర్మన్‌ను గద్దె దించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. వీరి అవిశ్వాసం పుణ్యామాని చైర్మన్ వర్గం కౌన్సిలర్లు మాత్రం విదేశీ టూర్లు, విలాసవంతమైన జీవితం గడుపుతూ ఎంజాయ్ చేస్తున్నారు.

జోరు వానకు కూలిన చెట్లు





పర్షానికి రామంతాపూర్ పరిధిలో కూలిన వృక్షాలు



రామంతాపూర్: నెహ్రూనగర్, ఇందిరానగర్, శారదానగర్ తదితర బస్తీలు, కాలనీల్లో శనివారం సాయంత్రం కురిసిన జోరు వానకు పలుచోట్ల చెట్లుకూలిపోయాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలాఉంటే దాదాపు 4 గంటల పాటు విద్యుత్ అంతరాయం కలిగింది. రామంతాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులతో పాటు విద్యుత్ ఫ్యూజ్ కాల్‌కు ఫోన్ చేసిన స్పందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో భారీ వర్షాలు కురిసిన ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావాని, ప్రస్తుతం వర్షం కురిసినప్పుడల్లా 3, 4 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

అల్వాల్: అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ ఇందిరానగర్‌లో నివసించే అన్వర్ బేగ్ (45) వ్యాపారం చేసుకుంటూ కుటుంబసభ్యులతో నివసిస్తున్నాడు. 20 రోజుల క్రితం కుటుంబసభ్యులు తమ స్వగ్రామం మధ్య ప్రదేశ్‌కు వెళ్లగా ఇంట్లో అన్వర్ ఒక్కటే ఉంటున్నాడు. అతని సోదరుడు మునబ్బర్ ఖాన్ ఈ నెల 17వ తేదీన అన్వర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో అన్వర్ భార్య తమ ఇంటి పక్కనే ఉండేవారికి ఫోన్ చేసి చెప్పగా వారు అన్వర్ ఇంటికి వెళ్లి చూడగా బెడ్రూంలో మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అన్వర్ మృతదేహాన్ని పరిశీలించారు. అతని ముఖం, తలపై గాయాలున్నట్లు గుర్తించారు. అన్వర్ సోదరుడు మునబ్బర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.